సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 22 । జనవరి । 2023



మంత్రి పల్లె నిద్ర

మంత్రి సీదిరి అప్పలరాజు నరియాపల్లిలో శనివారం పల్లె నిద్ర చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వంలోనూ పాల్గొన్నారు. – మందస



సంపద పరిరక్షించుకోవాలి


ఉత్తరాంధ్ర రచయితల మహాసభలు ఘనంగా జరుగుతున్నాయి. పురాతన వస్తువుల ప్రదర్శన ఆకట్టుకుంది.

- 8లో

సబ్జెక్టు టీచర్ల నియామకాలకు కౌన్సెలింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా శనివారం సబ్జెక్టు టీచర్ల నియామకాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టు టీచర్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ చేపట్టారు. తొలుత డీఈఓ శ్రీకాకుళం వెబ్‌సైట్‌లో పొందుపర్చిన సీనియారిటీ జాబితా ప్రకారం అర్హులైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన చేశారు.

ఆర్టీసీకి కాసుల క్రాంతి..!



- సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీకి దండిగా ఆదాయం
- అదనపు చార్జీలు లేకుండానే సర్వీసులు
- జిల్లాలో 315 బస్సుల ద్వారా రోజు వారీ ఆదాయం రూ.42లక్షలు
- ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకూ ఆర్టీసీకి చేకూరిన ఆదాయం రూ.4.64 కోట్లు



ఆర్టీసీ కాంప్లెక్స్ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బారులు తీరిన ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్:

సంక్రాంతి సీజన్ ఆర్టీసీకి కలిసి వచ్చింది. కోవిడ్ సమయంలో నష్టాల ఊబిలోకి జారిపోయిన ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. రెండేళ్లుగా పండగ సీజన్ ఆర్టీసీకి అంతగా ఆదాయం సమకూర్చలేదు. ఈ ఏడాది మాత్రం అదిరిపోయేలా ఆదాయం వచ్చింది. అదనపు ధరల భారం లేకపోవడంతో ప్రయాణికులు కూడా ఆర్టీసీ సర్వీసులకే ప్రాధాన్యతనిచ్చారు. దీంతో ఆర్టీసీకి దండిగా ఆదాయం సమకూరింది.

ఆదరించిన ప్రయాణికులు

కోవిడ్ తర్వాత పండగ సీజన్లలో రాకపోకలు అంతగా జరగలేదు. జనం కేవలం ఇళ్లకు పరిమితమయ్యారు. కొద్ది మంది మాత్రం ప్రయాణాలకు ఆసక్తి చూపినప్పటికీ వారు కూడా సొంత వాహనాలు ఉపయోగించుకున్నారు. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడింది. ఈ ఏడాది కరోనా ప్రభావం లేకపోవడంతో ప్రయాణాలు మళ్లీ పుంజుకున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు అధిక శాతం మంది ఈ దఫా ఆర్టీసీని ఆదరించారు. అధిక శాతం మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడంతో ఆర్టీసీకి మంచి లాభాలు చేకూరాయి.

అదనపు భారం లేకుండా..

సంక్రాంతి పండగ అంటేనే దూర ప్రాంతాల నుంచి ప్రయాణికులు స్వగ్రామాలకు రావడం పరిపాటి. అలా వచ్చే ప్రయాణికులపై అప్పట్లో అదనపు భారం (ప్రయాణ చార్జీ ఒన్ అండ్ హాఫ్ ఫేర్) వేయడం ఆనవాయితీగా వచ్చేది. ఇది ప్రయాణికులపై తీవ్ర ప్రభావం చూపేది. అయితే ఈ దఫా రాష్ట్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయాణికులపై అదనపు చార్జీల భారం వేయకూడదని నిర్ణయించుకుంది. అందుకు తగ్గట్లుగానే ఆర్టీసీ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ ఏడాది సంక్రాంతికి అదనపు ప్రయాణ చార్జీ లేకుండానే సాధారణ చార్జీలతోనే బస్సులను నడిపారు. దీంతో దూరప్రాంత ప్రయాణికులపై అదనపు భారం పడలేదు. జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలు, టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోల పరిధిలో 315 బస్సులు లక్షకు పైగా కిలోమీటర్లు తిరుగుతూ నిత్యం వేలాది మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు రాకపోకలు సాగిస్తుంటాయి. తద్వారా రోజుకు రూ.42లక్షలకు పైబడి ఆదాయం సమకూరుతుంది.

ఆదాయం రూ.4కోట్ల 64లక్షలు

సంక్రాంతి పండగ సందర్భంగా రోజువారీ తిరుగుతున్న (315) బస్సులకు అదనంగా మరో 42 బస్సులను ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ వేసి రద్దీ ఉన్న రూట్లలో నడిపారు. దీంతో ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ 357 బస్సుల ద్వారా 10,91,000 కిలోమీటర్లు నడిపి రూ.4 కోట్ల 64 లక్షలు ఆదాయం సమకూర్చుకున్నారు. పండగ రద్దీకి అనుగుణంగా ముందుగానే సర్వీసులను క్రమబద్ధీకరించుకున్నారు. వైజాగ్‌కు ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

ప్రయాణికులకు కృతజ్ఞతలు



ఈ ఏడాది సంక్రాంతి పండగ సందర్భంగా అధిక సంఖ్యలో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థను ఆదరించారు. దీంతో ఆర్టీసీకి మంచి ఆదరణ లభించింది. అదనపు చార్జీల భారం లేకపోవడంతో ఆర్టీసీల్లో ప్రయాణించేందుకు ప్రజలు ముందుకు వచ్చారు. సంక్రాంతి సందర్భంగా రోజువారీ ఆదాయం కాకుండా ఈనెల 11 నుంచి 19వ తేదీ వరకూ 75 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో అదనంగా ఆదాయం సమకూరింది. ఇందుకు వారికి కృతజ్ఞతలు.

– ఎ.విజయ్‌కుమార్, ఆర్టీసీ ప్రజారవాణా అధికారి

72 కేంద్రాల్లో కానిస్టేబుల్ పరీక్షలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి రీజియన్ ప్రాంతాల్లో మొత్తం 72 కేంద్రాల్లో పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. వీటికి సంబంధించిన అన్ని అంశాల్లో పోలీసు శాఖ అప్రమత్తమైందని పేర్కొన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు కచ్చితంగా ఉదయం 10 గంటలకంటే ముందుగానే ఉండాలన్నారు. ప్రతి కేంద్రాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వాటి నిర్వహణ ఎలా జరుగుతుందన్నదీ ప్రత్యేకంగా అధికారులతో పర్యవేక్షిస్తామన్నారు.

టెక్కలి రీజియన్ ప్రాంతంలోని పరీక్షా కేంద్రాలకు ముగ్గురు డీఎస్పీలు (ఎం.శివరామిరెడ్డి – కాశీబుగ్గ, జి.శ్రీనివాసరావు – డీపీటీసీ, ఎస్.వాసుదేవ్ – దిశా, శ్రీకాకుళం), ఐదుగురు సీఐలు, 35 మంది ఎస్ఐలు (సివిల్, డీఎఆర్, డీఎస్‌బి), టెక్కలి, కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లకు చెందిన 49 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 101 మంది పీసీలు, 33 మంది మహిళా పోలీసులు, 09 మంది మహిళా హోంగార్డులు వీరితో పాటు అదనంగా డీఎఆర్ నుంచి 40 మంది ప్రత్యేక సిబ్బంది, 10 మంది హెడ్, పోలీసు కానిస్టేబుళ్లు బందోబస్తు విధుల్లో పాల్గొంటారు.

శ్రీకాకుళం రీజియన్ ప్రాంతంలో పరీక్ష కేంద్రాలకు ముగ్గురు డీఎస్పీలు (మహేంద్ర మాతే – శ్రీకాకుళం, సీహెచ్‌జీవీ ప్రసాద్– శ్రీకాకుళం ట్రాఫిక్, బి.విజయ్‌కుమార్– ఎస్సీ, ఎస్టీసెల్), ఏడుగురు సీఐలు, 37 మంది ఎస్ఐలు (సీసీఎస్, దిశా, సివిల్, ట్రాఫిక్, డీపీటీసీ, డీటీఆర్‌బీ, డీసీఆర్‌బీ, సెబ్, సైబర్‌సెల్, పీసీఆర్ విభాగాలు), శ్రీకాకుళం సబ్ డివిజన్ నుంచి 49 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 63 మంది పీసీలు, 47 మంది మహిళా పోలీసులు, 40 మంది డీఎఆర్ ప్రత్యేక సిబ్బంది, పది మంది డీఏఆర్ హెచ్‌సీలు, పీసీలు విధులు నిర్వర్తిస్తారు.



శ్రీకాకుళంలోని పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

జిల్లా సీనియర్స్ కబడ్డీ జట్లు ఖరారు



ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, సెలక్టర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల కబడ్డీ జట్లు ఖరారయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపికచేసినట్టు సంఘ అధ్యక్షుడు వెంకన్న చౌదరి, ప్రధాన కార్యదర్శి అక్కేని చిరంజీవి తెలిపారు. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్, కె.సుదర్శనరావు, డాక్టర్ ఎస్.సీతారాం, సీనియర్ క్రీడాకారులు కె.రమేష్, జి.దామోదరరావు, డి.ధర్మారావు, ఎం. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పీడీలు సెలక్టర్లగా వ్యవహరించారు.

పురుషుల జట్టు: ఎస్.సురేష్, పి.మణికంఠ, టి.ఉపేంద్ర, కె.శంకర్, కె.సంతోష్, ఆర్.బాను, జె.హన్సికిషన్, ఎస్.చిన్నారావు, బి.గణేష్, ఎన్.నవీన్, డి.వాసు, కె.సతీష్, కె.ప్రసాద్, పి.వి.హరినాం, కె.ప్రవీణ్. **మహిళల జట్టు:** సీహెచ్ హేమలత, కె.శ్రావణి, ఎస్‌కే హగీన, ఎస్.హర్షిత, టి.యమున, బి.సింధుజ, టి.లిష, కె.వెంకటలక్ష్మి, ఎల్.ఆదిలక్ష్మి, టి.గాయత్రి, ఐ.కృష్ణవేణి, పి.దిశ, పి.అంబిక.

విద్యార్థుల హక్కుల ఉల్లంఘన జరగకూడదు

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలు బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు నిత్యం ఆధారాలతో కూడిన ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి పాఠశాలలపై కమిషన్ చట్ట ప్రకార నోటీసులు, సమన్లు జారీ చేస్తామని ఆంధ్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఆయన శనివారం శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలు, మండల విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులపై ఒత్తిడి పెంచడం సరికాదని అన్నారు. ఇలా జరగకూడదనే సెలవులు పక్కాగా అమలు చేయడంపై అన్ని జిల్లాల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఏ యాజమాన్యానికి కూడా ప్రభుత్వం నుంచి ప్రత్యేక మినహాయింపులు ఉండబోవని గుర్తు చేశారు. నోటీసు బోర్డుల్లో పిల్లల ఫీజుల వివరాలు తప్పనిసరిగా వెల్లడించాలని సూచించారు. విద్యార్థుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు ఆయా పాఠశాలల్లో సైకాలజిస్టుల నియామకం జరిగేలా జిల్లా విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో పాఠశాలలపై కమిషన్‌కు ఆధారాలతో ఫిర్యాదులు వస్తే మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో విచారణ కోసం హాజరయ్యే విధంగా సంబంధిత యాజమాన్యాలు, వ్యక్తులకు నోటీసులు, సమన్లు జారీ చేసి కమిషన్ తనదైన శైలిలో చట్ట ప్రకారం వ్యవహరిస్తుందన్నారు. బాలల హక్కులకు విఘాతం కలిగించే వారిని ఎవరినీ వదలబోమని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు అందరూ పాటించి తీరాల్సిందేనని అన్నారు. సమావేశంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ శ్రీలక్ష్మి, జిల్లా విద్యా శాఖాధికారి పగడాలమ్మ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పి.డి.కె.అనంతలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి జి.కృష్ణారావు, సీఆర్పీఎఫ్ ప్రతినిధులు కొత్తకోట శ్రీనివాస్, డాక్టర్ జగ్గారావు, మొదలవలస వాసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను ఈ నెల 26 నుంచి పూర్తి స్థాయిలో నిషేధిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు తయారు చేసే వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు వినియోగించకుండా నోడల్ ఆఫీసర్, సిటీ లెవెల్ టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు వినియోగించినా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంచు కౌగిట..

పొలాలపై మంచు దుప్పటి వీడడం లేదు. సూర్యోదయం అయ్యాక కూడా మంచు తెరలు తొలగడం లేదు. పచ్చటి పొలాలపై పరచుకున్న మంచు కొత్త కొత్త అందాలను ఆవిష్కరిస్తోంది.

– జి.సిగడాం



న్యూస్‌రీల్

24న జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 24న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి సాయి శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నెహ్రూయువ కేంద్రం కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ఈ ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, హెటిరో ల్యాబ్స్, జయభేరి ఆటో మోటివ్స్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు ఫోన్ నంబర్లు 95028 25143, 63010 45132 ఏపీఎస్ఎస్‌డీసీ హెల్ప్‌లైన్ నంబర్ 9988853335లను సంప్రదించాలని చెప్పారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ పిట్టర్, ఏదైనా డిగ్రీ, డిప్లమా, ఇంజినీరింగ్ (మెకానికల్) అర్హులుగా వివరించారు. అభ్యర్థులు టీఐఎన్‌వైయుఆర్ఎల్.సీఓఎం/ఎన్‌హెచ్ జెడ్ఎక్స్‌పిఎక్స్33 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

అడిగిన వారందరికీ 'ఉపాధి'



వీసీలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పని కోరిన వేతనదారులందరికీ ఉపాధి కల్పించాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ చిట్టి రాజు అన్నారు. ఆయన శనివారం జిల్లాలోని 30 మండలాలకు చెందిన ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పని దినాల కల్పనపై రాష్ట్ర అధికారులు ప్రతిరోజు సమీక్షిస్తున్నారని, ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్య ధోరణిని విడనాడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో కనీసం 200 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని లక్ష్యం నిర్దేశించారు. జిల్లాలో వేతనదారులు ఎక్కువగా ఉన్నప్పటికీ పని ప్రదేశాల వద్ద వారి హాజరు ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు. ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆయన మండిపడ్డారు. 100 రోజుల పనిదినాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు పూటలా కూలీలు పనులు చేస్తున్న ఏకైక జిల్లా శ్రీకాకుళం అని, కానీ సగటు వేతనం తక్కువగా ఉండడం సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సగటు వేతనం రూ.250కి తగ్గితే సహించేది లేదన్నారు. జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కోరారు. అంతకు ముందు ఆయన శ్రీకాకుళం రూరల్ మండలంలోని నైరా పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

'జూన్ ఆఖరుకు జలాశయం పనులు పూర్తి'



వంశధార రిజర్వాయర్ పనులు పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ సుగుణాకర్‌రావు తదితరులు

హిరమండలం: వంశధార జలాశయం(రిజర్వాయర్) పనులు జూన్ నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ సుగుణాకరరావు ఆదేశించారు. ఆయన శనివారం వంశధార రిజర్వాయర్‌లో కాంక్రీట్ పనులను వంశధార ఎస్ఈ డోల తిరుమలరావుతో కలిసి పరిశీలించారు. హై లెవల్ కెనాల్, రిజర్వాయర్ గట్టు, హెడ్ రెగ్యులేటర్ వంటి పనులను పరిశీలించారు. అలాగే రిజర్వాయర్‌లోకి గొట్టా బ్యారేజీ నుంచి నీటిని నింపేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ఎత్తిపోతల పథకానికి సంబంధించిన అలైన్‌మెంట్లు పరిశీలించారు. తర్వాత వంశధార అతిథి గృహంలో వంశధార ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. అలైన్‌మెంట్లలో మార్పులు సూచించారు. ఆయనతో పాటు వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ, డీఈఈలు రవికాంత్ సురేష్, పలువురు ఇంజినీర్ అధికారులు ఉన్నారు.

పరారైన రిమాండ్ ఖైదీ అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్య చికిత్స కోసం వచ్చి ఈ నెల 19న పరారైన రిమాండ్ ఖైదీ గుడియా కాళీ (22)ని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పోక్సో కేసులో నిందితుడైన కాళీ అంపోలు సెంట్రల్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్నాడు. వైద్యం కోసం రిమ్స్‌కు పోలీసులు తీసుకురాగా.. వారి కళ్లుగప్పి పారిపోయాడు. శనివారం ఉదయం శ్రీకాకుళం నగరంలోని ఆదివారంపేట కూడలి వద్ద బస్సు కోసం వేచి చూస్తున్న సమయంలో పోలీసులు మాటు వేసి అతడిని పట్టుకున్నారు. ఫిబ్రవరి 3 వరకు కాళీ రిమాండ్‌లో ఉంటాడని పోలీసులు తెలిపారు.

కిడ్నీ భూతాన్ని తరిమికొట్టాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



కిడ్నీ వ్యాధులపై మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానం ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ముందుకు రావాలని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని కోర్టు చాంబర్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఉద్దానం ప్రాంత ప్రజలు అందరూ విధిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మరణాల రేటు తగ్గించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లా న్యాయ వ్యవస్థ అంతా కలిసికట్టుగా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇంతవరకు శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానం ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో 3 వైద్య శిబిరాలు, మూడు న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేశామని, తద్వారా మూత్రపిండాల వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ఉద్దానం వాసులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

'ప్రభుత్వ శాఖలోకి తీసుకోండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: 108 యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 108 ఉద్యోగులను ప్రభుత్వ శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని వారు కోరారు. ప్రభుత్వ నియామకాల్లో అర్హత ఉన్నవారికి వెయిటేజీ మార్కులు ఇవ్వాలని కోరారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, ప్రతి నెలా పీఎఫ్‌ను యాజమాన్య వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తగ్గించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 108 ఉద్యోగులను జిల్లా మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

క్లుప్తంగా

జిల్లాకు ఏపీ ఎస్‌పీఎఫ్ డీజీపీ రాక



ఎస్‌పీఎఫ్ డీజీపీ సంతోష్ మెహ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీపీ సంతోష్ మెహ్రా శనివారం రాత్రి జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా డీజీపీని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎస్పీ జి.ఆర్.రాధిక మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నైపుణ్యంతోనే గుర్తింపు



ఆర్ఎస్ఐ మంగలక్ష్మిని అభినందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : నైపుణ్యం, ప్రతిభలే ఉద్యోగికి గుర్తింపు తీసుకొస్తాయని ఎస్పీ జి.ఆర్.రాధిక కొనియాడారు. ఏలూరు జిల్లా పెదవేగి పోలీసు శిక్షణా కేంద్రంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహిళా ఆర్ఎస్ఐ ఐయితిరెడ్డి మంగలక్ష్మి, ఆర్మ్‌డు రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ ఎ.జనార్దనరావులు ప్రతిభ కనబరచడంతో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. 45 రోజుల శిక్షణా కాలంలో మంగలక్ష్మి రాష్ట్ర స్థాయి బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ ట్రైనింగ్‌లో ఆల్ రౌండ్ విభాగంలో ద్వితీయస్థానం, జనార్దనరావు శిక్షణలో ప్రతిభ చూపినందుకు ఏ–గ్రేడ్ శ్రేణిలోనిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో జిల్లా పోలీసు శాఖలో పనిచేసి సిబ్బందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.ప్రసాదరావు, ఆర్ఐలు బి.ప్రదీప్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి



కొత్తూరు సబ్ ట్రెజరీలో వార్షిక తనిఖీలు నిర్వహిస్తున్న డీడీ రవికుమార్

కొత్తూరు: జిల్లాలో అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు జీఓ–7 ప్రకారం బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయడంతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ట్రెజరీ డీడీ సీహెచ్ రవికుమార్ సూచించారు. కొత్తూరు ఉప ఖజానా కార్యాలయంలో శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40,486 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకుగాను ఇంత వరకు 21,236 మంది మాత్రమే ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ చేసుకున్నట్లు వివరించారు. ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ చేయడం వల్ల పెన్షన్ రద్దు అవుతుందనే అపోహను వీడాలన్నారు. పెన్షనర్లు ఫిబ్రవరి 28లోపు లైఫ్ సర్టిఫికెట్లను సబ్ ట్రెజరీలకు అందజేయాలన్నారు. జిల్లాలో 16464 మంది పెన్షనర్లకు పింఛన్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టీఓలు సీహెచ్ సమతా రాణి, వై.మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని దమ్మలవీధిలో మద్యం అక్రమంగా అమ్ముతూ ఓ వ్యక్తి పట్టుబడిన ట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ శనివారం తెలిపారు. దమ్మల వీధికి చెందిన అల్లిపల్లి వాసుదేవరావు (35) ఆరు మద్యం బాటిళ్ల ను అమ్ముతుండగా మాటువేసి పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	54,930–00
బంగారం(22క్యా. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225

ఆల్‌రౌండ్ చాంపియన్‌గా విశాఖ



ఆల్‌రౌండ్ చాంపియన్‌గా నిలిచిన విశాఖపట్నం అథ్లెట్స్ బృందంతో ఎంపీ, నిర్వహణ కమిటీ ప్రతినిధులు

- ముగిసిన అండర్–14, 17 రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలుపోటీలు
- నేడు, రేపు అండర్–19 విభాగాల పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరుగుతున్న 66వ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–14, అండర్–17 బాలబాలికల పోరు ముగిసింది. అథ్లెటిక్స్ పోటీల ఆల్‌రౌండ్ చాంయన్‌షిప్‌గా విశాఖపట్నం నిలిచింది. ఆతిథ్య శ్రీకాకుళం జిల్లా 77 పాయింట్లతో ద్వితీయ స్థానం, విజయనగరం 74 పాయింట్లతో తృతీయ, వైఎస్సార్ కడప 67 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాయి. వ్యక్తిగత విభాగాల్లో అండర్–14 బాలుర విభాగంలో పి.సాయికిరణ్ (శ్రీకాకుళం) 777 పాయింట్లతో, బాలికల విభాగంలో పి.ప్రవల్లికారెడ్డి (విశాఖపట్నం) 710 పాయింట్లతో చాంపియన్లగా నిలిచారు. అండర్–17 బాలుర విభాగంలో పి.రూబేష్‌బాబు (కృష్ణా) 773 పాయింట్లతో, బాలికల విభాగంలో పి.తిరీషా (విశాఖపట్నం) 812 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్లగా నిలిచి బహుమతులు అందుకున్నారు. విజేతలగా నిలిచిన క్రీడాకారులకు శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు పతకాలు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లాలో రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీలను నిర్వహించడం గర్వకారణమన్నారు. కాగా ఆది, సోమవారాల్లో అండర్–19 విభాగంలో బాలబాలికలకు పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే 13 జిల్లాల క్రీడాకారులు మైదానం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ గార పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పి.సుందరరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎం.వి.రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎం.తిరుపతిరావు, పి.తవిటయ్య, కె.హరిబాబు, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, మీట్ పరిశీలకులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మనిషిలో మార్పు తెచ్చేది చదువే



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చదువే మనిషి మార్పునకు మూలమని, సమాజ వికాసానికి దోహదకారి అని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో బాపూజీ కళామందిర్‌లో శనివారం కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు నేతృత్వంలో కార్పొరేషన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 400 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూరిబాబుకు వచ్చే గౌరవవేతనాన్ని ఏటా సామాజిక కార్యక్రమాలకు వెచ్చించడం శుభపరిణామమన్నారు. చైతన్యవంతమైన సమాజం నిర్మాణం కోసం, సామాజిక వ్యత్యాసాలు తొలగించేందుకు విద్య ఒక్కటే ఆయుధమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే విద్యకు అధికంగా ఖర్చు చేస్తోందని గుర్తు చేశారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పిల్లలు ఓటు వేస్తారని కాదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే క్రమంలో పోటీ ప్రపంచానికి అనుగుణంగా రాణించేందుకు వీలుగా నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆర్థిక స్తోమత కలిగిన వారంతా ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

ప్రజాదరణ ఓర్వలేక..

టీడీపీ నేతలు, ఎల్లో మీడియా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేనితనంతో సైకో అని అనడం దారుణమని మంత్రి ధర్మాన మండిపడ్డారు. సైకో అయితే ఇన్ని మంచి పనులు చేసి రాష్ట్రంలో సమూలమైన మార్పులు తీసుకురాగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేస్తున్న మానవ అభివృద్ధి, వనరుల అభివృద్ధిని అడ్డుకున్నవారే అసలైన సైకోలని పేర్కొన్నారు. ఇకనైనా దూషణలు, అసత్యప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్పొరేషన్ల చైర్మన్ల పదవీ కాలం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సాధు వైకుంఠరావు, కోణార్క్ శ్రీను, గురుగుబెల్లి లోకనాథం, అంధవరపు ప్రసాద్, సురింగి మోహనరావు, అంధవరపు సంతోష్, మండవిల్లి రవి, వి.నాగరాజు, గుడ్ల దాము, చల్లా అలివేలుమంగ, పైడి మహేశ్వరరావు, బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా మళ్లీ జగనే రావాలి



శ్రీశయన, పొందర కార్పొరేషన్ చైర్మన్లను సత్కరించిన దృశ్యం

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు

నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి అయితేనే బీసీలకు మేలు జరుగుతుందని, పేద కుటుంబాలకు న్యాయం జరుగుతుందని శ్రీశయన, పొందర–కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్లు చీపురు రాణి, రాజాపు హైమావతి అన్నారు. తమ పదవీ కాలం పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం రాత్రి జీఓ జారీ చేయడంతో శనివారం నరసన్నపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఎంకు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పంగ కృష్ణవేణి ఫోనులో మాట్లాడుతూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్లుగా కొనసాగుతున్న సదాశివుని కృష్ణ, అదికార్ల సాంబమూర్తి, పాట్నూరు సాయి ప్రసాద్, మల్లిఖార్జున స్వామి, లుకలాపు రంజిత్‌లు మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కోసం పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, నాయకులు పంగబావాజీ నాయుడు, చీపురు కృష్ణ, చింతు రామారావు, ఆర్.శ్రీధర్, కనుసు సీతారాం, బగ్గు రమణయ్య, ధర్మాన జగన్, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదవీకాలం పెంపుపై హర్షం



మామిడి శ్రీకాంత్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్ అని ఎల్లప్పుడూ వారికి పెద్దపీట వేసే ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ల పదవీ కాలం పెంచడం పట్ల 55 కార్పొరేషన్ చైర్మన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మరింత సమర్థంగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి కృషి చేస్తామన్నారు. తమకు మళ్లీ అవకాశాన్ని కల్పించి ఆదరించినందుకు స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

డీసీఎంఎస్ స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట



డీసీఎంఎస్ స్థలంలో కంచె పనులు పర్యవేక్షిస్తున్న సుగుణా దేవరాజ్ తదితరులు

నరసన్నపేట: మండలంలోని జమ్ము వద్ద పర్లాకిమిడి రోడ్డుకు ఆనుకొని డీసీఎంఎస్‌కు చెందిన రూ.20 కోట్ల విలువైన స్థలం కబ్జాకు గురికాకుండా పాలకవర్గం, సిబ్బంది అడ్డుకున్నారు. స్థలం ఆక్రమణకు గురవుతున్నట్లు తెలిసిన వెంటనే స్పందించిన డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సుగుణా దేవరాజ్ శనివారం సిబ్బందితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. మండల సర్వేయర్ బృందం కొలతల ప్రకారం అప్పగించిన 1.76 ఎకరాల విస్తీర్ణం చుట్టూ హద్దులు వేసి ఇనుప కంచె వేసే పనులు ప్రారంభించారు. డీసీఎంఎస్‌కు చెందిన స్థలంగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్రమణ సమాచారం సకాలంలో అందించిన నరసన్నపేట తహసీల్దార్ ఏ.సింహాచలంను అభినందించారు. కంచె దాటి ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్థలంపై పట్టాదార్ పాస్‌పుస్తకం ఉందని, వన్‌బీలో డీఈఎంఎస్ స్థలంగా నమోదై ఉందని చెప్పారు. అలాగే నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో బైరాగి వీధి వద్ద ఉన్న డీసీఎంఎస్ గోదాములను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిజినెస్ మేనేజర్ పొందరి లక్ష్మణరావు, బీఎం–2 జగ్గునాయుడు పాల్గొన్నారు.

కుమార్తె వద్దకు వెళ్లకుండానే..

- మతిస్థిమితం లేక దారితప్పి మృతి చెందిన వృద్ధురాలు
- మృతురాలిది శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం
- వాట్సాప్ గ్రూప్‌ల్లో సమాచారంతో గుర్తించిన బంధువులు



మృతిచెందిన బైరమ్మ

కె.కోటపాడు : కూతురు ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక... మతిస్థితిమితం సరిగా లేక, సరైన తిండి లభించక.. చలిగాలిలో తిరుగుతూ చివరకు తన కుమార్తెను చూడకుండానే ఓ పిచ్చితల్లి విగత జీవిగా మారింది. ఈ విషాద సంఘటన అనకాపల్లి జిల్లా కె.కోటపాటు మండలం ఎ.కోడూరులో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం నారాయణపురంలో ఉంటున్న కర్రి బైరమ్మ(76) తన ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేసింది. తన భర్త మరణించడంతో నారాయణపురంలో గల పెద్ద కుమార్తె జానకమ్మ వద్ద బైరమ్మ ఉంటోంది. పండగ సందర్భంగా కె.కోటపాడు మండలం సింగన్నదొరపాలెంలో గల తన చిన్న కుమార్తె నారాయణమ్మ ఇంటికి ఈ నెల 13న బయలుదేరింది. అయితే మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వేరే ప్రాంతంలో బస్సు దిగింది. ఎ.కోడూరు గ్రామంతో పాటు శివాలయం పరిసరాల్లో బైరమ్మ తిరుగుతూ ఉండేదని స్థానికులు తెలిపారు. స్థానికులు పెట్టిన ఆహారం తినేదని చెప్పారు. సరైన తిండిలేక, చలిగాలిలో తిరుగుతూ ఉండడంతో వృద్ధురాలైన ఆమె ఆరోగ్యం క్షీణించి శివాలయానికి కొద్ది దూరంలో గల తోటలో మృతి చెందింది. బైరమ్మ మృతదేహాన్ని స్థానికులు చూసి, వీఆర్వోకు సమాచారం అందజేశారు. గుర్తుతెలియని మృతదేహంపై వీఆర్వో కె.నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఆయన సంఘటన ప్రాంతానికి వెళ్లి బైరమ్మ మృతదేహాన్ని పరిశీలించి, పలు వాట్సాప్ గ్రూప్‌ల్లో మృతి సమాచారాన్ని ఉంచారు. దీంతో మృతదేహాన్ని గుర్తించిన బైరమ్మ కుమార్తెలు నారాయణమ్మ, జానకమ్మతో పాటు బంధువులు సంఘటనా స్థలానికి వచ్చారు. మతిస్థిమితం సరిగా లేకే ఆమె దారి తప్పి ఉంటుందని వారు చెప్పారు. చిన్నకుమార్తె ఇంటికి బైరమ్మ చేరకపోవడంతో ఈ నెల 13 వతేదీ నుంచి విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో గాలించామని వారు తెలిపారు. తల్లి మృతదేహాన్ని చూసి కుమార్తెలు రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. పోస్టుమార్టం అనంతరం బైరమ్మ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

జానపద సంపదను పరిరక్షించుకోవాలి



మహాసభలో మాట్లాడుతున్న సినీగేయ రచయిత డాక్టర్ అందెశ్రీ



విభిన్న వాయిద్య పరికరాలు, తాళపత్రాలతో సేకర్త జయధీర్ తిరుమలరావు

పలాస/కాశీబుగ్గ: ఉత్తరాంధ్రలో అపారమైన జానపద సంపద ఉందని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత యువ కవులు, రచయితలపై ఉందని ప్రముఖ కవి, పరిశోధకుడు జయధీర్ తిరుమలరావు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఎస్.ఎం.సి ఫంక్షన్ హాలులో శనివారం రెండు రోజుల ఉత్తరాంధ్ర రచయితల మహాసభలు ప్రారంభమయ్యాయి. సినీనటుడు, ప్రముఖ జానపద కళాకారుడు డాక్టరు కుమార్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో ఉత్తరాంధ్ర జానపదాలు అనే అంశంపై సెమినార్ జరిగింది. ఉత్తరాంధ్ర జానపద కళలపై పరిశోధన చేసిన బద్రి కూర్మారావు తన ఆటపాటలతో ఉర్రూతలూగించారు. ప్రముఖ సినీగేయ రచయిత డాక్టర్ అందెశ్రీ, పార్వతీపురం నుంచి వచ్చిన ప్రముఖ కవులు గంటేడ గౌరనాయుడు, సిరికి స్వామినాయుడు, బగాది వెంకటరావు, తదితరులు ఉత్తరాంధ్ర యాస, భాషపై ప్రసంగించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.వి.సతీష్ తదితరులు ఉత్తరాంధ్ర కళలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్దానం సాహితీ సాంస్కృతి వేదిక అధ్యక్షుడు చిక్కోలు జగదీస్, కార్యదర్శి లండ రుద్రమూర్తి, కార్యవర్గ సభ్యులు నిశితాసి, గుమ్మడి సాంబమూర్తి, కుత్తుం వినోద్, శివజ్యోతి, కాళిదాసు, తెప్పల కృష్ణమూర్తి, దాసరి తాతారావు, డాక్టర్ బిఆర్అంబేద్కర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు దానేటి పద్మ, శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు, కళాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి

పోలాకి: మండలంలోని బెలమర గ్రామానికి చెందిన గొర్లె సత్యం అనే వ్యక్తి తనపై దాడి చేసినట్లు అదే గ్రామానికి చెందిన దళిత మహిళ సబ్బి లక్ష్మి శనివారం పోలాకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సబ్బి లక్ష్మి తన ఇంటికి ఆనుకున్న ఉన్న ప్రభుత్వ స్థలంలో వరిగడ్డికుప్ప పెట్టుకుంది. అక్కడ గడ్డికుప్ప తొలగించాలని కాలనీవాసులు కొన్ని రోజులుగా తగాదాపడుతున్నారు. ఈ క్రమంలో గొర్లె సత్యం అనే వ్యక్తి మద్యం మత్తులో స్థానిక సర్పంచ్ ఇంటికి వెళ్లి హెచ్చరిస్తూ అక్కడి నుంచి వచ్చి గడ్డికుప్పకు నిప్పుపెట్టాడు. అనంతరం లక్ష్మిపై దాడికి పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు సత్యంపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు. కాగా, దళిత మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, దళితహక్కుల పోరాట కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి డిమాండ్ చేశారు.

‘ధాన్యం కొనుగోలుపై ఆందోళన వద్దు’



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతుల పక్షాన ఉందని ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. టెక్కలి మండలం పోలవరం, లింగాలవలస ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు వారి ధాన్యం అమ్మకాల విషయంలో ఆర్‌బీకేల్లో ట్రక్ షీట్ చూపకపోవడంపై శనివారం ధాన్యం లోడులతో సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా రైతులంతా సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ధాన్యం లోడులకు సంబంధించి వేబ్రిడ్జ్‌లో బరువు తూయించిన తర్వాత రైతు భరోసా కేంద్రాల్లో ట్రక్ షీట్ చూపకపోవడంతో రెండు రోజుల నుంచి నిరీక్షిస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే తమ ధాన్యం అమ్మకాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులంతా సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. టెక్కలి మండలానికి సంబంధించి మిల్లర్లకు కేటాయించిన బ్యాంకు గ్యారంటీ పూర్తి కావడంతో ట్రక్ షీట్ చూపడం లేదని, తక్షణమే కోటబొమ్మాళి మండలంలో ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు చెప్పడంతో వారంతా వెనుదిరిగారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. రైతులు పండించిన ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు.